క్లుప్తంగా

'మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం సనపల ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయాభివృద్ధి, పాడి పశువుల పెంపకం, పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీ మోహనరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు

మందస: అంగన్‌వాడీ కేంద్రాలతో మేలు జరుగుతోందని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం –గోపాలపురం, మూలిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సోమవారం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, హాట్ కుక్డ్ మీల్స్ తదితర పౌష్టికాహారం అందజేయడం జరుగుతోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామచంద్రమహంతి, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, అంగన్‌వాడీ కార్యకర్త మూర్తిక సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు టెంక శ్యాంఘన్నో తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి

టెక్కలి: మండలంలోని చల్లపేట గ్రామానికి చెందిన తర్రా లక్ష్మణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన భార్యకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అధికారులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



బాధితురాలు బరిటి పద్మ

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర గ్రామానికి చెందిన బరిటి పద్మ అనే దళిత మహిళ తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ వల్లభ వసంతరావుపై ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. సర్వే నంబర్ 252-1లో సుమారు 2 ఎకరాలను ఆక్రమించుకొని తప్పుడు పత్రాలను సృష్టించారని పేర్కొన్నారు. భూమిని ఇవ్వమని అడిగితే గతంలో తనపై దాడి చేశారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మురుగు నీరు తొలగింపు



జేసీబీ సాయంతో మురుగు తొలగిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి అంబేడ్కర్ జంక్షన్ వద్ద కాలువల్లో కొద్ది రోజులుగా మురుగు నీరు నిల్వ అవ్వడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులకు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్‌కు సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంబేడ్కర్ జంక్షన్‌లో కాలువలపై ఉన్న ప్లేట్‌లను జేసీబీ సాయంతో సోమవారం తొలగించారు. అనంతరం కాలువలో పేరుకుపోయిన చెత్తను తీసి, పంచాయతీ ట్రాక్టర్‌తో డంపింగ్ యార్డ్‌కు తరలించి శుభ్రం చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సభ్యులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

బాపూజీ మార్గం అనుసరణీయం



కంచిలి: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: బాపూజీ చూపిన మార్గం అనుసరణీయమని హెచ్‌ఎం బి.శంకరం అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఇన్నేశుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరంలో గాంధీ చేపట్టిన ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి అధికారులు, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఎంపీపీ రోణంకి ఉమ, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, నాయకులు అన్నెపు రామారావు, ఎస్.వినోద్, రోణంకి మల్లయ్య, నేతింటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు

సోంపేట: మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. గ్రామంలో గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు.

కంచిలి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి బెహరా, కె.కుశరాజు, బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



సోంపేట: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కోటబొమ్మాళి: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

ఖాతాదారుల సమస్యలు పరిష్కరించండి



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అలియన్స్ క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: బ్యాంకుల్లో ఖాతాదారులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అలియన్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాల బ్రాంచి మేనేజర్లను సోమవారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఇటీవల కాలంలో బ్యాంక్ ఖాతాల నుంచి ఖాతాదారుని ప్రమేయం లేకుండా నగదు విత్‌డ్రాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలియన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎల్.నరసింహమూర్తి, డి.గోపి, ఉమాశంకర్, ఎల్.వెంకట్రావ్, బుజ్జి, రమణ, ప్రకాష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గతం మరిచి విమర్శలు చేస్తున్నారు

- టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ సరోజనమ్మ తదితరులు

టెక్కలి: మండలంలోని టీడీపీ నాయకులు గతం మరిచి ఎమ్మెల్సీ దువ్వాడపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిషోర్‌లు అన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై టీడీపీ నాయకులు చేసిన విమర్శలపై వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించి ఘాటుగా స్పందించారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో అచ్చెన్నాయుడు చేసిన అవినీతిపై బహిరంగంగా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అవినీతి చేసినట్లు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. టీడీపీ పాలనలో ఒక్కో కార్యకర్త ఎంత మేరకు అవినీతి చేశారో ప్రతీ ఒక్కరికీ తెలుసునని దుమ్మెత్తిపోశారు. రాజకీయాల్లో విమర్శలు చేయడం సహజమని, కానీ వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇకపై తప్పుడు విమర్శలు చేస్తే తరిమి కొడతామన్నారు. సమావేశంలో నాయకులు బి.హరి, ఎస్.మోహన్, జి.మోహన్‌రెడ్డి, జి.అప్పలరెడ్డి, కె.కామేష్, బి.ఉదయ్, జె.తిరుమల, ఆర్.మురళీరెడ్డి, పి.శ్రీను, బి.రాజేష్, టి.లోకేష్, బి.శ్రీను, డి.శ్రీను, ఎ.రవి, ఎల్.సంజీవరావు, జి.తేజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



టెక్కలి: కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: ప్రజారోగ్యంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని జెడ్పీటీసీ దువ్వాడ వాణి అన్నారు. కుష్టు వ్యాధి నియంత్రణలో భాగంగా పట్టణంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా సర్వే కార్యక్రమం ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్యం, వ్యవసాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఎక్కడా కుష్టువ్యాధి కనిపించకుండా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అలాగే పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా మాతా శిశు మరణాలు లేకుండా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ జి.సుజాత, వైస్ ఎంపీపీ పి.రమేష్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఎస్.శంకర్, ఎంపీటీసీ పి.హేమలత, వి.శ్రీధర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ గాయత్రీ, సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రస్తుతం కుష్టువ్యాధి ప్రాణాంతకం కాదని, ముందస్తుగా గుర్తించి మందులు తీసుకుంటే నయమవుతుందని కొళిగాం పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారి బి.రేవతి అన్నారు. లెప్రసీ నిర్మూలన పక్షోత్సవాలు సందర్భంగా కొళిగాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధికి అవగాహనే అసలైన మందు అన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ సర్వే చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్ర పట్నాయక్, సీహెచ్‌వో ఎస్.దానమ్మ, హెచ్‌వీలు కె.నాగేశ్వరి, సీహెచ్ అరుణకుమారీ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేవతి



వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ సాధ్యమని వైద్యులు పేర్కొన్నారు. మండలంలోని వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, బాతుపురం, కొండవూరు తదితర గ్రామాల్లో స్పర్శ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యుడు కనిష్క, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, సర్పంచ్ కొల్లి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యతో దేశాభివృద్ధి



మాట్లాడుతున్న కృష్ణకుమారి

కవిటి: మహిళా విద్యతో దేశాభివృద్ధి సాధ్యమని భారత వైమానిక దళ స్క్వాడ్రన్ లీడర్ ఎం.కృష్ణకుమారి అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగ యూపీ పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నేత రజనీకుమార్ దొళాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ధైర్య సాహసాలు కలిగిన బాలబాలికలు ఉన్నారన్నారు. వారిని చిన్నతనం నుంచి నచ్చిన రంగంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత రజనీకుమార్‌దొళాయి మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఆత్మవిశ్వాసం, ధృఢ సంకల్పం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘునాథ్ పాణిగ్రాహి, ముద్దపు శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొండవూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, పార్టీ నేతలు, క్రియాశీలక కార్యకర్తలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొనాలని కోరారు.

మండపల్లిలో ఓపెన్ హౌస్



మాట్లాడుతున్న జాస్మీన్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాలలో గెస్ట్ చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ జాస్మీన్(జూలీ) మాట్లాడుతూ బాలికలకు స్నేహపూరిత వాతావరణం కల్పించాలని సూచించారు. బాలికలు తమ సమస్యలను మహిళా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అనంతరం గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1098 టోల్ ఫ్రీ నంబరుకు ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాబాల వెంకటరావు, సాజన్, మహేశ్వరి, మహిళా పోలీస్ గౌతమి, టీమ్ లీడర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 100 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తిరుమల, రవి తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల స్వైర విహారం



అడవి పందులు నాశనం చేసిన చెట్టుని చూపిస్తున్న మహిళ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని సీతాపురం, బెండి, పెద్దబొడ్డపాడు, కొండవూరు, నారాయణపురం, కొల్లిపాడు, కూర్మనాథపురం తదితర గ్రామాల్లో అడవి పందులు స్వైర విహారం చేస్తూ ఉద్యాన పంటలను నాశనం చేస్తున్నాయి. తిత్లీ తుఫాన్ ప్రభావంతో కొబ్బరి చెట్లు కూలిపోవడంతో వాటి స్థానంలో రైతులు మరలా మొక్కలు వేశారు. అయితే రాత్రి సమయాల్లో అడవి పందులు సంచరిస్తూ చెట్లను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంట చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అభినందనలు

నందిగాం: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన జి.అభిరాం, బి.మోక్ష, బలిడే అఖిల, దొరబాబు, వాసు, పాత్రో గోపాల్‌లు సత్తాచాటారు. దీంతో వీరిని పాఠశాలలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సోమవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరిబాబు, పీడీ గజరాపు శ్రీనివాసరావు, ప్రగడ రమణమూర్తి, నాయకులు జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, విద్యా కమిటీ చైర్మన్ సనపల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కోటబొమ్మాళి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- లఖందిడ్డిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కోటబొమ్మాళి: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లఖందిడ్డి 2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. విద్యుత్ మీటరు లేని పేరిశెట్టి మల్లమ్మ ఇంటికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాణిక్య, వీఆర్వో సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్‌రాజు, సర్పంచ్‌లు బమ్మిడి గణపతి, నూక సత్యరాజ్, కాళ్ల సంజీవరావు, సుంకరి జనార్ధన, గొండు చాందిని, ఎస్వీ రమణ, గొద్దు చిరంజీవి, బొడ్డు వెంకటరమణ, దుబ్బ సింహాచలం, బలగ సూర్యారావు, చింతు శ్రీరాములు, ఎంపీటీసీ చుక్క లోకనాథం, ఎంపీడీవో ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందజేయాలి

టెక్కలి: గ్రామ వలంటీర్లు, ఆశా వర్కర్లు ఉత్తమ సేవలు అందజేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. సంతబొమ్మాళి మండలం పరిధిలో కొత్తగా విధుల్లోకి చేరిన ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లకు టెక్కలిలో నియామక పత్రాలను సోమవారం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. అనంతరం పాలతలగాం గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కె.గోవింద్, నాయకులు ఎం.అప్పారావు, పి.రామకృష్ణ, పి.రవికుమార్‌రెడ్డి, బి.మోహన్‌రెడ్డి, పి.పాపారావు, ఎం.భాస్కర్‌రెడ్డి, డి.వేణు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి

- లంచాలు తీసుకుంటున్నారని ఆరోపణ
- సాక్ష్యాలతో నిరూపిస్తా: కో-ఆప్షన్ సభ్యుడు సంతోష్‌కుమార్
- ఇదే పరిస్థితి కొనసాగితే చట్టపరమైన చర్యలు: చైర్మన్ గిరిబాబు



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి నిర్మాణాలు జరపాలన్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు లంచాలు ఇవ్వాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు పద్ధతి మార్చుకోవాలని కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్ అధికారులకు నగదు ముడితే తప్ప పనులు జరగడం లేదన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేటీరోడ్డులో ప్రధాన డ్రైన్‌కు వీధుల నుంచి వచ్చిన డ్రైన్‌లను అనుసంధానం చేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ శాంతినగర్ కాలనీకి మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం చైర్మన్ బి.గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శక ప్రభుత్వమని అందరూ గ్రహించాలన్నారు. లంచం తీసుకున్నటువంటి అధికారులపై తగిన సమాచారంతో బాధితులు ముందుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

మున్సిపాలిటీలో ప్లాస్టిక్ బ్యానర్ల నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.కృష్ణారావు, కౌన్సలర్లు శంకర్ పండా, దువ్వాడ శ్రీకాంత్, గుజ్జు జోగారావు, బడగల సుజాత, దున్న నిర్మల, రోణంకి శ్రీనివాసరావు, సవర సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అవగాహన అవసరం



మాట్లాడుతున్న పూర్వపు వీసీ లజపతిరాయ్

టెక్కలి: ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ వ్యాపారాలపై అవగాహన అవసరమని అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వపు వీసీ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. అంతర్జాతీయ వ్యాపారాలు-వాణిజ్య సంబంధాలు అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సులో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, ఎంబీఏ హెచ్‌వోడీ కె.వేణుగోపాలరావు, కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్ కో-ఆర్డినేటర్ బి.శివకుమార్, చింతామణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాలుగో షిఫ్ట్ సేవలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఉన్నటువంటి డయాలసిస్ కేంద్రంలో మంగళవారం నుంచి నాలుగో షిఫ్ట్ సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. సోమవారం డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వం నుంచి వస్తున్నటువంటి డయాలసిస్ సేవలు మూడు షిఫ్ట్‌లలో ఉండేవని, ప్రస్తుతం నాలుగో షిఫ్ట్ పెడితే మరికొంతమందికి ఉపయోగపడుతుందన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొండవూరులో ఊరమ్మ తల్లి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 68 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో సోమవారం సెమీ ఫైనల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు దట్టి నాగేష్, కె.రాజేష్, సీహెచ్.కేశవరావు, కె. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు సాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని చిన అంగవానిపేట గ్రామానికి చెందిన సంగారు విజయ్ చదువుకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సాయం అందించింది. సోమవారం విజయ్ ఇంటికి వెళ్లి తల్లి పార్వతికి రూ.8500 నగదును అందించారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు తిరుపతిరావు, ప్రశాంత్, జోగారావు, శ్రీధర్, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వే చేపట్టాలి

కంచిలి: ప్రతినెలా సిటిజన్ అవుట్ రీచ్ సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండలంలోని పోలేరు, కేసరపడ గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేపడుతున్న సర్వే తీరును సోమవారం పరిశీలించారు.

బడిబయట విద్యార్థుల గుర్తింపు

కంచిలి: కలెక్టర్ ఆదేశాలతో బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించేందుకు మండల విద్యాశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మండలంలోని ముండ్ల, సాగరనొగాం గ్రామాల్లో సీఆర్పీ టి.ఢిల్లీరావు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రామారావులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు.

కవిటి: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. కవిటి కాలనీలో డ్రాపౌట్‌గా ఉన్న జడగల కాంచన అనే బాలికను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బెందాళం మల్లేశ్వరరావు సమక్షంలో చేర్పించారు. ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి చదువు ప్రయోజనాన్ని వివరించారు.

మెరుగైన సేవలు అందించాలి

టెక్కలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు 104 వాహనాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.లక్ష్మీ తులసి సూచించారు. మండలంలోని సీతాపురం గ్రామంలో 104 వాహనం ద్వారా అందుతున్న వైద్య సేవలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆమెతో పాటుగా వైద్యాధికారి డా.నీతు, సిబ్బంది చంద్రశేఖర్, అరుణ తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నందిగాం: మండల కేంద్రమైన నందిగాంలో స్థానిక గణేష్ కాలనీ నుంచి చర్చి మీదుగా రెల్లివీధికి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా ఆ రహదారి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నా స్థల సమస్యతో మోక్షం లభించలేదు. అయితే ఇటీవల గ్రామస్తుల కోరిక మేరకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, స్థానిక సర్పంచ్ జడ్యాడ రమణమ్మ, నాయకులు జడ్యాడ జయరాం, అంబోడి విష్ణులు స్థల సమస్యను పరిష్కరించి రహదారి ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. దీంతో సోమవారం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



స్తంభాలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 26వ వార్డులో సోమవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అక్కడి సమస్యలు తెలుసుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశించడంతో, అవసరమైనచోట స్తంభాలు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ కార్యాలయం లైన్ ఇన్‌స్పెక్టర్ గార రాజారావు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈ యోగి, మల్లా గోపాలరావు, మల్లా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.